31నే పెన్షన్ల పంపిణీ

మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

జూన్ నెలకు సంబంధించి పింఛను ఈ నెల 31వ తేదీ శనివారం ఉదయం 6.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో 8,956 మంది లబ్ధిదారులకు శనివారం ఉదయం 6:30 గంటల నుంచి 35వ వార్డు సచివాలయంలో పని చేస్తున్న 224 మంది సచివాలయ కార్యదర్శులతో పింఛన్ల సొమ్మును సక్రమంగా లబ్ధిదారులు ఇంటింటికి వెళ్లి సగటున 50 మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ఉదయం 6 : 30 గంటలకు వారి వారి ఇళ్ల వద్ద ఉండాలని తెలిపారు. ఏ లబ్ధిదారుడూ ఆఫీసుకు గానీ, సచివాలయానికి గానీ పింఛను కోసం రావాల్సిన పనిలేదని తెలిపారు..

ఉపాధి పనులపై ఎంపిడిఓల నిర్లక్ష్యం..!

'నూజివీడు మండలంలో ఒకే వ్యక్తి ఫొటోనూ అనేకసార్లు వాడుతూ మస్తర్ల నమోదులో అవినీతి జరిగినట్లు తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులొస్తే తప్ప పట్టించుకున్న నాథుడే లేడు. జిల్లా అధికారులు విజిలెన్స్ అధికారిని నియమించి విచారణ చేయించి వాస్తవాలు నిగ్గు తేల్చేపనికి దిగారు.'

'ఎంతసేపు పని చేసినా తమకు రూ.250 లోపే వేతనం వస్తుందని ఉపాధి శ్రామికులు గగ్గోలు పెడుతున్నారు. ఉపాధి వేతనం తక్కువ వస్తున్నప్పుడు ఎంపిడిఒలు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకుని వేతనం పెరిగేలా చర్యలు తీసుకుని ఉపాధి శ్రామికులు మేలు జరిగేలా చూడాల్సి ఉన్నా.. ఏఒక్క మండలంలోనూ పట్టించుకున్న దాఖలాల్లేవు.'

ప్రోగ్రామింగ్ అధికారిగా ఎంపిడిఒదే ప్రధాన బాధ్యత

తమకు సంబంధం లేదన్నట్లు సదరు అధికారుల తీరు

ఉపాధి శ్రామికుల మస్తర్ల నమోదులో తీవ్రమైన అవినీతి ఆరోపణలు

పనుల కల్పన, పూర్తి వేతనాల అమలుపై కనీసం పట్టని ఎంపిడిఒలు

రెండు జిల్లాల్లో 5.50 లక్షలు జాబ్‌కార్డులు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీ చట్టం అమల్లో ప్రోగ్రామింగ్ అధికారిగా ప్రధాన బాధ్యత నిర్వహించాల్సిన మండల పరిషత్ అధికారులు (ఎంపిడిఒలు) కనీసం పట్టించుకోని పరిస్థితి. చట్టంలో ఉన్న నిబంధనలు సైతం అమలుకు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 3.73 లక్షలు, పశ్చిమగోదావరి జిల్లాలో 1.80 లక్షలు వరకూ ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. లక్షల సంఖ్యలో ఉన్న ఉపాధి శ్రామికులకు నిబంధనల ప్రకారం పని కల్పించడం, ప్రభుత్వం నిర్దేశించి వేతనం (కూలి) అందేలా చూడటంలో ఎంపిడిఒలదే కీలక బాధ్యత. ఉపాధి హామీ పనుల పర్యవేక్షణకు సంబంధించి మండలస్థాయిలో ఎపిఒ, గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తారు. వీరిద్దరిని సరైన పద్ధతిలో నడిపించి ఉపాధి శ్రామికులకు పని కల్పించడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎంపిడిఒదే. రెండు జిల్లాల్లోనూ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా సాగుతోంది. ఎంపిడిఒలు ఉపాధి హామీ చట్టం అమలులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గతేడాది

2024–25కు సంబంధించి ఉపాధి శ్రామికులకు రోజువారీ వేతనం ప్రభుత్వం రూ.300గా నిర్ధేశించింది. ఏలూరు జిల్లావ్యాప్తంగా సరాసరిన ఏడాది మొత్తంగా ఉపాధి శ్రామికులకు అందిన వేతనం రూ.253గా అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ వేతనం సరాసరిగా అందినది మాత్రమే. చాలామంది శ్రామికులకు రూ.200 లోపు వేతనం అందిన రోజులు చాలానే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.200లోపు వేతనంతో ఏవిధంగా జీవనం సాగించాలో అధికారులు చెబితేనే బాగుంటుంది. ఉపాధి పనులకు సంబంధించిన ప్రణాళిక, వేతనం పూర్తిస్థాయిలో అందేవిధంగా ఎంపిడిఒలు బాధ్యత తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లు ఏది చెబితే అదేన్నట్లు ఎంపిడిఒలు తలాడిస్తున్న పరిస్థితి ఉంది. వేతనం ఎందుకు తక్కువగా వస్తుందో ఎపిఒ, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపిడిఒలు కనీసం మాట్లాడని పరిస్థితి ఉంటోంది. ప్రతియేటా ఇదే విధంగా జరుగుతోంది. వేతనం తక్కువగా వస్తుండటంతో చాలామంది ఇతర పనులకు వెళ్తున్న పరిస్థితి నెలకొంటుంది. పనికి రావడం లేదని మరోవిధంగా అధికారులు ప్రచారం చేస్తున్న పరిస్థితి ఉంటోంది. ఎంపిడిఒల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి శ్రామికులు తీవ్రంగా నష్టపోతున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి శ్రామికులు వేతనం రూ.307గా నిర్ణయించారు. శ్రామికులకు పూర్తిస్థాయిలో వేతనం అందేలా మండలాధికారులు సరైన ప్రయత్నం చేయడం లేదు. జిల్లా అధికారులు ఒత్తిడి తెస్తేనే కొంతమేర చేస్తున్నారు. మండలస్థాయిలో మాత్రం దీనిపై ప్రణాళికాబద్ధంగా పని జరగని పరిస్థితి కన్పిస్తోంది. ఉపాధి హామీ చట్టం అమలుపై జిల్లా కలెక్టర్లు పూర్తిస్థాయిలో జోక్యం చేసుకుని ఎంపిడిఒల పని తీరుపై సమీక్ష జరిపితే తప్ప ఉపాధి శ్రామికులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

మస్తర్లపై తీవ్ర ఆరోపణలు

ఉపాధి హామీ పనుల్లో అత్యధికంగా మస్తర్లకు సంబంధించిన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఏఒక్క మండలం అతీతం కాదనే చెప్పొచ్చు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇంటి దగ్గర ఉన్న వారికి సైతం మస్తర్లు వేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ నాయకుల జోక్యంతో ఫీల్డ్ అసిస్టెంట్లు అనేక తప్పులు చేస్తున్నట్లు స్పష్టంగా బయటపడుతున్నాయి. మస్తర్లతోపాటు ఇతర ఉపాధి పనుల్లో సమస్యలు ఏవైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చే వరకూ ఎంపిడిఒలు పట్టించుకోవడం లేదు. ఉపాధి పనులకు సంబంధించి నిరంతరం ఎంపిడిఒలు పర్యవేక్షణ జరపడం లేదని స్పష్టంగా తెలుస్తోంది. ఎంపిడిఒల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి శ్రామికులకు తీరని నష్టం ఏర్పడుతోంది.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ వేగవంతం చేయాలి

ఆర్థిక పురోభివృద్ధికి, సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నాం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి – భీమవరం

జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నామని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గత సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలపై చేపట్టిన కార్యాచరణపై సమీక్షించారు. కమిటీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కుల ధ్రువీకరణపత్రాల జారీలో జాప్యం జరుగుతోందని, ఎస్‌సి, ఎస్‌టిల పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా ఉంటున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా గతంలో ఆధార్ ఎన్‌రోల్ అయ్యి ఉండటం వల్ల మరోసారి ఎన్‌రోల్ చేయడానికి సాధ్యపడదని, సంబంధిత పిల్లల వివరాలను సేకరించి ఆధార్ నమోదులో సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. యువతకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని, వివిధ కంపెనీల అవసరాల మేరకు అర్హులను అందించలేకపోతున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల పిల్లలు స్కూల్‌కెళ్లి చదువుకునేలా కమిటీ సభ్యులు ప్రోత్సహించడంతోపాటు బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు వైద్య చికిత్స సక్రమంగా అందిస్తున్నామన్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో లభ్యంకాని కుక్కకాటు, పాము కాటు ఇంజెక్షన్లు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. గుండెపోటుకు సంబంధించి మొదటి గంటలో ఇచ్చే ఇంజెక్షన్ కూడా ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి మోనిటరింగ్ కమిటీ సభ్యులు మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, జిల్లెల్ల సత్య సుదామ మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు ఇచ్చే ప్రోత్సాహకాలు నిలిపివేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులకు సంబంధించి కేసులు పోలీస్ స్టేషన్ స్థాయిలోనే నిర్వీర్యమవుతున్నాయని, ఎఫ్ఐఆర్ నమోదుకు జాప్యం జరుగుతుందని, దీనివల్ల బాధితులకు న్యాయం జరగడం లేదని అన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగలి వెంకటేశ్వర్లు, ఎఎస్‌పి యు.భీమారావు, డిఎస్‌డబ్ల్యుఒ బివిఎస్‌బి.రామాంజనేయరాజు, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతీబ్ కౌసల్ భానో, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, నర్సాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద, గిరిజన సంక్షేమాధికారి డి.పుష్పరాణి, సిఐలు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

కడుపు నింపని యోగా అవసరమా : వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి – గణపవరం

ఉపాధి కూలీలకు తొమ్మిది వారాల నుండి వేతన బకాయిలు ఇవ్వకుండా పని ప్రదేశాల్లో కూలీలతో యోగా చేయించడం అవసరమా అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం వ్యకాస నేతలు అప్పన్నపేటలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ మార్చి 15 తర్వాత పని చేసిన కూలీలకు వేతనాలు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశాల్లో కూలీలతో యోగా చేయించడం సిగ్గుచేటన్నారు. నిరంతరం శారీరక శ్రమ చేసే కూలీలకు యోగా అవసరమా అని ప్రశ్నించారు. కూలి పనులతో వచ్చే సొమ్ముతో బతికే కూలీలకు చట్టప్రకారం 15 రోజుల్లో వేతనాలు అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు కూడా మాట్లాడారు.

గణపవరం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆచంట: ఉపాధి హామీ కూలీలకు ఆరు వారాలుగా డబ్బులు పడకపోవడంతో ఆయా కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ అన్నారు. ఉపాధి హామీ పర్యటనలో భాగంగా గురువారం కరుగోరుమిల్లిలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారితో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కరుగోరుమిల్లి నుంచి లంక గ్రామాలకు ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారికి వచ్చేది రూ.182 మాత్రమేనని వాపోయారు. ఎంత పని చేసినా చేతికి చిల్లిగవ్వ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి నదిపై పడవలో కూలీలు వెళ్లొచ్చేందుకు ఒకొక్కరికి రోజుకు రూ.125 ప్రయాణ ఛార్జీలు అవుతున్నాయని, ఈ లెక్కన వారానికి రూ.750 పడవ ప్రయాణానికే అవుతున్నాయని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాల్లో మోడీ ప్రభుత్వం ఉందని, వీటిని తిప్పికొట్టేందుకు జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు శ్రీను, కె.వెంకటేశ్వరరావు, యాకోబు, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

తాగునీరు అందించండి

శ్రీనగర్‌వాసుల ఆందోళన

ప్రజాశక్తి – ఆకివీడు

తాగడానికే కాదు, కనీసం ఇతర అవసరాలకు కూడా ఉపయోగించుకోలేని నీటిని నగర పంచాయతీ సరఫరా చేస్తోందని సిపిఎం పట్టణ నాయకులు పెంకి అప్పారావు ఆరోపించారు. గురువారం స్థానిక శ్రీనగర్ కాలనీ మహిళలు సిపిఎం ఆధ్వర్యంలో మురుగునీటి సరఫరాను నిరసిస్తూ కాలనీ వద్ద ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. కుళాయిల ద్వారా వచ్చిన నీరు మురికి వాసన వస్తున్నాయని, ఆ నీటితో స్నానం చేస్తే రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. ప్రభుత్వానికి వేలాది రూపాయలు కుళాయి పన్నుగా చెల్లిస్తున్నా తాగునీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కుళాయి నీరు నీచు, నాచువాసన వస్తున్నాయని, ఆకుపచ్చ, నల్ల రంగులో ఉంటున్నాయని మహిళలు వివరించారు. అధికారులు తక్షణం తాగునీరు అందించకపోతే నగర పంచాయతీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దొడ్డి పద్మ, ఎస్‌కె.అమ్మాజీ, మువ్వా సుబ్బలక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి, ఆలేటి సత్యనారాయణ, పుష్ప, బలగ రాము, ఆగుల ఆంజనేయులు, ముత్తు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న శ్రీనగర్ వాసులు

పెట్రోల్ బంకు ఏర్పాటుకు అడ్డగోలుగా విద్యుత్ వైర్ల మార్పు

గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి – మొగల్తూరు

ఒకరి లాభం కోసం పలువురి పేదల ఇళ్లకు ఇబ్బంది కల్గించడం దారుణమని సిపిఎం మండల నాయకులు యడ్ల చిట్టిబాబు అన్నారు. కెపిపాలెం మెయిన్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం సమీపంలో పెట్రోల్ బంకు నిర్మించుకునేందుకు 11 కెవి విద్యుత్ వైర్లను అడ్డగోలుగా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానికులు గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడారు. ఒక వ్యక్తికి లాభం కల్గిస్తూ పలువురికి అన్యాయం చేయడం దారుణమన్నారు. గత 50 సంవత్సరాల నుండి ఉన్న విద్యుత్ లైన్లు తొలగించి నాలుగు విద్యుత్ స్తంభాలను కొత్తగా పేదలు, వెనుకబడిన కులాల ఇళ్లకు చేర్చి వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 11 కెవి లైన్‌ను అధికార పార్టీ ప్రోద్బలంతో ఇష్టానుసారం మార్చి పేదలకు ఇబ్బంది కల్గిస్తున్నారన్నారు. ఆందోళనా ప్రాంతానికి సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ జి.వాసు, విద్యుత్ శాఖ ఎఇ ప్రభాకర్‌రావు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. వారు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో గుబ్బల సత్యనారాయణ, కవురు బాబూరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నూరు శాతం క్షయ నిర్మూలనే లక్ష్యం

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి – భీమవరం

జిల్లాలో నూరు శాతం క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన టిబి ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే టిబి వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు రూ.600 విలువైన పౌష్టికాహార సరుకులను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ పథకంపై స్ఫూర్తి పొందిన జిల్లా కలెక్టర్ తాను కూడా నిక్షయ్ మిత్రలో 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని ఆహారాన్ని అందిస్తానని సమావేశంలో ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి ముందుకు రావాలని, నిక్షయ్ మిత్రగా నమోదై పౌష్టికాహారాన్ని అందించేందుకు అవసరమైన సరుకులను అందించాలని అన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం సమాచారంతో కూడిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయి, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ బి.భానునాయక్, డిసిహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, మన హాస్పిటల్ డాక్టర్ డి.మల్లికార్జునరావు, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ దోసిరెడ్డి, డిఎన్ఎంఒ డాక్టర్ వై.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

పొలం గట్టుపైనే ప్రసవం..!

తల్లీ బిడ్డ క్షేమం

ప్రజాశక్తి – వీరవాసరం

పొలం గట్టుపైనే ఒక గర్భిణి ప్రసవించిన ఘటన వీరవాసరం మండలం మత్స్యపురిలో గురువారం చోటు చేసుకుంది. కైకలూరుకు చెందిన గంధం స్వామి, నాంచారమ్మ దంపతులు కొద్దిరోజుల క్రితం మత్స్యపురి గ్రామంలో కొటాలమెరకు ప్రాంతంలో తాత్కాలిక ఆవాసం ఏర్పాటు చేసుకుని బాతులు మేపుకుంటున్నారు. ఈ క్రమంలో గర్భిణి నాంచారమ్మకు పురిటి నొప్పులు వస్తుండటంతో భర్త ఆందోళన చెంది స్థానికంగా ఎవరైనా వైద్యులు అందుబాటులో ఉన్నారేమోనని ఆరా తీశారు. ఈలోపే భార్యకు ప్రసవం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఆరోగ్య సిబ్బంది గోడి చినతల్లి, కాటిక జయశేఖర్, శిరీష ఘటనా స్థలికి చేరుకుని ఆమెకు వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌లో వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యాధికారి గులాబ్‌రాజ్‌కుమార్, మొహిసినాతాజ్‌లు వైద్య సేవలందించి తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్టు నిర్ధారించారు. మరో రెండు రోజులపాటు ఆరోగ్య కేంద్రంలో ఉంచి తరువాత ఇంటికి పంపిస్తామని వారు తెలిపారు.

పొలం గట్టు పైనే ప్రసవించిన బాలింతకు వైద్యం అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అలుగు చిత్తరంజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి – భీమవరం

సమాజానికి సేవలందించిన అలుగు చిత్తరంజన్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం అన్నారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద అలుగు చిత్తరంజన్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీతారాం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ చిత్తరంజన్ 40 ఏళ్ల వయస్సులో ఆచంట ఎంఎల్‌ఎగా గెలిచి ప్రజల సమస్యలపై చురుగ్గా, నీతి నిజాయతీలతో పని చేశారన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో తన గొంతు వినిపించారన్నారు. ఆయన ఎంఎల్‌ఎ కాకముందే సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, యువజన సంఘం ఏరియా కార్యదర్శిగా పని చేశారన్నారు. ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. కార్యకర్తలు చిత్తరంజన్‌ను ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు బి.వాసుదేవరావు, జె.సత్యనారాయణ, నాయకులు ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, మెరెపె లత, గురదాసు రఫాయేలు పాల్గొన్నారు.

చిత్తరంజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

దేశ రక్షణలో సైనికుల పాత్ర అమూల్యం

నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎన్‌వి.రమణారావు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎంతో అమూల్యమైందని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని నిట్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం తీరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ భారత సైన్యం ధైర్య సాహసాలకు, త్యాగ నిరతికి ఆపరేషన్ సింధూర్ ప్రతీక అన్నారు. మాతృభూమి కోసం అహర్నిసలూ శ్రమిస్తున్న ప్రతి సైనికుడి జీవితం స్ఫూర్తిదాయికమేనని తెలిపారు. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ రమణారావు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్‌లు వి.సందీప్, హిమబిందు, ఆచార్యులు టి.కూర్మయ్య, గుర్రాల కిరణ్ కుమార్, రాజేశ్వర రెడ్డి, నర్సింహారావు పాల్గొన్నారు.

జిల్లాలో యోగాంధ్రకు భారీ ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి – భీమవరం

యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు భారీ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్మృతివనం వద్ద ఏర్పాటు చేసిన యోగా శిక్షణలో ఆమె స్వయంగా పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లాస్థాయిలో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి ఆయా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు ఇలా అన్ని తరగతుల ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. యోగా మంత్ కార్యక్రమంలో భాగంగా వంద మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరు 50 మంది చొప్పున ట్రైనర్లను తీర్చిదిద్దేలా మూడు రోజులపాటు శిక్షణ పూర్తి చేస్తామన్నారు. గుర్తించిన పర్యాటక ప్రదేశాల్లో కనీసం ఐదు వేల మందితో యోగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 3న ప్రసిద్ధ క్షేత్రం పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున యోగా నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. జూన్ 9వ తేదీ మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో, 16వ తేదీ భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద, 19వ తేదీ భీమవరం డిఎన్ఆర్ కాలేజీ, నరసాపురం వైఎన్ కళాశాలలో ఐదు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జూన్ 2 నుండి 14 వరకు యోగా పోటీలను వివిధ స్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ యోగా పాట, ఉత్తమ యోగా పెయింటింగ్, ఉత్తమ యోగా వ్యాసం తదితర అంశాల్లో విజేతలను ప్రకటించి, జూన్ 17, 18 తేదీల్లో బహుమతులను అందజేస్తామన్నారు. జూన్ 2న రంగోలి పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారీఎత్తున యోగా ప్రదర్శనా కార్యక్రమానికి సన్నాహక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. డిఇఒ ఇ.నారాయణ, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎవి.అప్పారావు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, ఆయుష్ శాఖ డాక్టర్ హరి శ్రీనివాస్, యోగా మాస్టర్ ట్రెయినీలు యు.వెంకటేశ్వరరాజు, పి.భవానీ, పి.రోహిణి, ఇషా ఫౌండేషన్ భీమవరం కోఆర్డినేటర్ డాక్టర్ డి.విజయ, ప్రముఖ సంఘ సేవకులు కంతేటి వెంకటరాజు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి యోగా మాస్టర్ బిహెచ్‌వి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

యర్రంశెట్టివారిపాలెంలో చైన్ స్నాచింగ్

ప్రజాశక్తి – నరసాపురం

యర్రంశెట్టివారిపాలెంలో గురువారం మధ్యాహ్నం చైన్ స్నాచింగ్ జరిగింది. బాధితురాలు కథనం ప్రకారం యర్రంశెట్టివారిపాలెం గ్రామం అరవవారిమెరకకు చెందిన చెన్ను లక్ష్మి భర్త వెంకటేశ్వరరావుతో కలిసి నరసాపురం వచ్చింది. తిరిగి గ్రామానికి వెళ్తు రుస్తుంబాద 216 జాతీయ రహదారిపై ఆటో దిగి భార్యభర్తలిద్దరూ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుతున్నారు. ఈక్రమంలో కొద్ది దూరం వెళ్లిన తర్వాత వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఆగంతకుడు లక్ష్మి మెడలోంచి మూడు కాసుల నల్లపూసల గొలుసును లాక్కుని బైక్‌పై ఉడాయించాడు. అదే సమయంలో ఆమె మెడలో ఉన్న సూత్రాలు బొందును గట్టిగా పట్టుకోవడంతో బొందు ఉండిపోయింది. క్షణాల్లో జరిగిన ఈ చోరీని పక్కనే ఉన్న భర్త వెంకటేశ్వరరావు కూడా గమనించలేకపోయాడు. లక్ష్మి కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసేటప్పటికి రోడ్డుపై బైక్ కనిపించలేదు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితుడ్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రక్షిత తాగునీటి ట్యాంకులు శుభ్రం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కాళ్ల

రక్షిత తాగునీటి పథకాల్లో కానరాని క్లోరినేషన్ శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ శాఖ అధికారులు స్పందించి మండలంలోని పలు గ్రామాల్లో ట్యాంక్ క్లీనింగ్ పనులు చేపడుతున్నారు. ట్యాంక్ లోపల ఉండే మురికి, నాచు, ఇతర వ్యర్థాలను తొలగించే ప్రక్రియను చేస్తున్నారు. ట్యాంక్ క్లీనింగ్ ద్వారా అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అమిరపు ఫణి తెలిపారు. బొండాడపేట గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్ క్లినింగ్ చేసినట్లు తెఇపారు. ఇప్పటి వరకు ఈ నెలలో రెండుసార్లు ట్యాంక్ శుభ్రం చేశామని గ్రామ కార్యదర్శి మణి కంఠ తెలిపారు.

రామరాజుకు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం

జి.రామరాజు

వాకర్స్ ఇంటర్నే షనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ గుంటూరు రామరాజు 2025 సంవత్సరానికి ఎన్‌టిఆర్ స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు డిస్ట్రిక్ట్ 201 క్యాబినెట్ సెక్రటరీ గాదిరాజు కృష్ణంరాజు, ట్రెజరర్ పాకలపాటి సీతారామరాజు, బులెటిన్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు, ఎడిటర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, జాలీవాకర్ గొట్టుముక్కల అప్పలరాజు తెలిపారు. ఎన్‌టిఆర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 31న విజయవాడ పిబి సిద్ధార్థ కళాశాల కళావేదికలో ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేస్తారని తెలిపారు. గుంటూరు రామరాజు వాకర్స్ జిల్లా గవర్నర్‌గా, వాకర్స్ ఉద్యమ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనను డిఎన్ఆర్ కళాశాల అసిస్టెంట్ సెక్రెటరీ ఆర్.రామకృష్ణరాజు, వాకర్స్ అధ్యక్షులు కటికల పల్లారావు, ట్రెజరర్ కనగర్ల విజయరామకృష్ణ, మార్నింగ్ కాఫీక్లబ్ సభ్యులు బొండా రాంబాబు, ఓలేటి శ్రీనివాస్, కారుమూరి సత్యనారాయణ మూర్తి అభినందించారు.

విజయదుర్గ ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పాలకోడేరు మండలం పెన్నాడ తామర చెరువు గట్టు వద్ద శ్రీవిజయదుర్గ అమ్మవారి నూతన ఆలయానికి దాతలు రూ.20 వేల విరాళం అందించారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని ఎంఎల్ఎ అంజిబాబు నివాసంలో గురువారం పట్టణానికి చెందిన రాష్ట్ర కృష్ణ బలిజ బిసి సాధికారత కమిటీ డైరెక్టర్ గంటా త్రిమూర్తులు రూ.20 వేల విరాళాన్ని ఎంఎల్ఎ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. దాతలు ముందుకొచ్చి విరాళాలు అందిస్తున్నారని ఎంఎల్ఎ తెలిపారు. అనంతరం దాత త్రిమూర్తులను సత్కరించారు. యలమంచిలి శ్రీను, విన్నకోట వినాయక్ బాబు, శ్యామ్, కాపా అమర్ బాబు, గొలగని దుర్గారావు, ఎండి ఫిరోజ్, శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంచితనం అంజిబాబు సొంతం

బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్‌లో ఎంఎల్ఎ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్


ఎంఎల్ఎకు కేక్ తినిపిస్తున్న ఏసుబాబు

మంచితనం, మానవత్వం ఎంఎల్ఎ అంజిబాబుకే సొంతమని పలువురు వక్తలు అన్నారు. ఎంఎల్ఎ రామాంజనేయులు (అంజిబాబు) పుట్టినరోజును పురస్కరించుకుని ఒక రోజు ముందుగానే పద్మాలయ థియేటర్ రోడ్డులోని బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్‌లో గురువారం తారకరామ కన్‌స్ట్రక్షన్ ఛైర్మన్ పళ్ల ఏసుబాబు అధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. డిఎస్‌పి జయసూర్య, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, పలువురు డాక్టర్లు, జనసేన నాయకులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎంఎల్ఎను సత్కరించారు.

ఘనంగా ప్రసాద్‌రాజు పుట్టినరోజు

ఆచంట:వైసిపి బలోపేతానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు పుట్టినరోజు సందర్భంగా వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. వైసిపి ఆచంట నియోజకవర్గ నాయకులు, వైట్ల కిషోర్ కుమార్, మనవర్తి విజయ కుమార్, ముడకల నానిబాబు, శీలం చిట్టియ్య పాల్గొన్నారు.

'ఎవరెస్ట్ అధిరోహణ కష్టతరం'

భీమవరం టౌన్:ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరం ఎక్కడం ఎంతో కష్టమైన విషయమని యూత్ హాస్టల్స్ జిల్లా అధ్యక్షులు వేగిరాజు సోమరాజు అన్నారు. శ్రీరాంపురం యూత్ హాస్టల్స్ కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మౌంట్ ఎవరెస్ట్ శిఖర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ 1953లో మొదలైన ఎవరెస్ట్ పర్వతారోహణ నుంచి ఇప్పటి వరకూ సుమారు 7 వేల మంది మాత్రమే శిఖరంపైకి చేరుకున్నారని తెలిపారు. యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి మట్లపూడి సత్యనారాయణ, భీమవరం యూత్ హాస్టల్స్ సభ్యులు జనపాటి మధు, కట్రెడ్డి వెంకటరత్నం, కె.సత్యనారాయణ, కె.పాండురంగారావు, ఎస్.హనుమంత్‌రావు మాట్లాడారు. భీమవరం నుంచి కంచడపు లక్ష్మణ్ ఇటీవలే 570 మీటర్లు ఎక్కారని, ప్రవీణ్ కూడా భీమవరం నుంచి వెళ్లారని అన్నారు.

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

నరసాపురం:నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. గురువారం చిత్రలేఖనంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర అంశంపై శిరిగినీడి రాజ్యలక్ష్మి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పుస్తకపఠనం, పొడుపు కథలు విప్పడం, కథలు చెప్పడం చెప్పించడం, ఆటలు ఆడించడం, డాన్స్ క్లాసులు నిర్వహించారు. వనిత క్లబ్ కార్యదర్శి స్వర్ణ లత, డాక్టర్ అమ్మాజీ,సిహెచ్ శ్రీనివాస్ స్కూల్ అసిస్టెంట్ సత్యనారాయణ, మిమిక్రీ ఆర్టిస్ట్ సూర్యం బాబు పాల్గొన్నారు. ఈ గ్రంథాలయాన్ని అందరూ ఉపయోగించుకోవాలని గ్రేడ్‌వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

పెనుమంట్ర : పిల్లలు విద్యతో పాటు ఆత్మ రక్షణ పద్ధతులు నేర్చువాలని న్యూమాక్స్ కుంగ్‌ఫూ మాస్టర్ ఎం.ఫణికుమార్ అన్నారు. గురువారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో 31వ రోజు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు ఆయన వివిధ ఆత్మ రక్షణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్ మోరల్ స్టోరీస్,విశ్రాంత టీచర్ పి.సువర్ణగౌరి, లైబ్రరీ అధికారి శివకుమార్ చెప్పారు. ఎం.సత్యనారాయణ, టి.రాహుల్, డి.జశ్వంత్ అమర్‌రెడ్డి, కె.కార్తికేయ పాల్గొన్నారు.

పెదఅమిరంలో రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామంలోని రతన్ టాటా మార్గ్‌లో ఉన్న ఎల్‌సి నెంబర్ 11 రైల్వే ట్రాక్ మరమ్మతుల పనుల్లో భాగంగా గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకూ మూడు రోజుల పాటు రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కాళ్ల

అతి వేగంగా కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లిన ఘటన కాళ్లకూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జువ్వలపాలెం వైపు నుంచి వస్తున్న కారు కాళ్లకూరులో అదుపుతప్పి అతివేగంతో సచివాలయం ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లింది. కారులో నలుగురు ప్రయాణం చేస్తున్నారు. కారుకు బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణ నష్టం తప్పింది. విద్యుత్ స్తంభం పూర్తిగా ధ్వంసమైంది.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన ఎన్ఫోర్స్మెంట్ దాడుల్లో వెదుళ్లపాలెం గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు ఎంఎస్ నారాయణను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. అతని వద్ద నుండి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎన్ఫోర్స్మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పర్యావరణహిత వ్యవసాయంపై దృష్టి సారించాలి

జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

పర్యావరణ హితమైన వ్యవసాయంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. ఆచంట మృత్యుంజయ కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే అమలు చేయబడుతున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన, అన్నదాత సుఖీభవ ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు వ్యవసాయ యాంత్రీకరణ, ధాన్యం కొనుగోలు గురించి రైతులకు వివరించారు. రసాయన రహిత సాగుతో పండించిన ఆహార పంటలు ప్రజా ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ముఖ్యంగా వ్యవసాయ భూములను ఆరోగ్యంగా మలచుకుంటూ సాగు నీటిని వృథా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలన్నారు.ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ప్రధాన శాస్త్రవేత్త ఎన్‌వి.ప్రసాద్, ఐసిఎఆర్, డాక్టర్ వై.సుబ్బయ్య తదితర శాస్త్రవేత్తలు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. పాలకొల్లు ఎడిఎ అడ్డాల పార్వతి, మత్స్యశాఖ ఎడిఎ ఆర్‌విఎస్‌వి ప్రసాద్, ఉద్యానవన శాఖాధికారి ఎన్.ప్రియదర్శిని, మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ జూన్ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం డబ్బులు విడుదల చేస్తుందన్నారు. ఆచంట, శేషమ్మ చెర్వు, పెనుమంచిలి గ్రామాల రైతులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఖరీఫ్‌లో రైతులు ముంపును తట్టుకొని, మంచి దిగుబడి ఇచ్చే వరి విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పి.వినయలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం ఆలమూరు గ్రామ సచివాలయ ప్రాంగణంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. శాస్త్రవేత్త పి.వినయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభం కానుందని రైతులు సరైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫామ్ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త ఎంవి.ప్రసాద్ మాట్లాడుతూ ఆసక్తి గల రైతులు ఆయిల్ పామ్ సాగు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే సబ్సిడీలు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే సబ్సిడీలు వినియోగించుకుని తద్వారా ఆయిల్ ఫామ్ సాగు చేయాలని వివరించారు. ఉండి కెవికె ఫిషరీష్ శాస్త్రవేత్త శ్రీనివాసరావు, మార్టేరు పశుసంవర్ధక శాఖ ఎడిఎ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పెనుమంట్ర వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వెలగల బుల్లి రామిరెడ్డి, వెటర్నరీ డాక్టర్ జి.లక్ష్మి, ఆలమూరు గ్రామ నాయకులు గుర్రి శంకరం, రైతులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:వ్యవసాయాన్ని లాభదాయకంగా చేయడానికి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం నిరంతరం పని చేస్తుందని ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ పేర్కొన్నారు. పట్టింపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభయన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వరి, అరటి, కొబ్బరి, పామాయిల్, జామ, బొప్పాయి, కోకో, నిమ్మ తదితర పంటలను రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో పండిస్తారని తెలిపారు. పరిశోధనా సంచాలకులు రమణ మాట్లాడారు. మురళీకృష్ణ, వ్యవసాయశాఖ దేవానంద్, ఉద్యానశాఖ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల

మాట్లాడుతున్న తహశీల్దార్ సుందర్‌సింగ్

రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు సాంకేతిక పరిజ్ఞానంతో అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తహశీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో చౌక డిపో డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సుందర్ సింగ్ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల ద్వారా బియ్యం, ఇతర నిత్యవసర సరుకులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. దుకాణంతో పాటు ఐదు రకాల ఫొటోలు తీసి అప్లోడ్ చేసి ఉండాలన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ సరుకులు పంపిణీ చేయాలని,ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ చౌక డిపోలు తెరిచి ఉండాలని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిరణ్, చౌక డిపో డీలర్లు పాల్గొన్నారు.

తణుకు:జూన్ 1వ తేదీ నుంచి మండలంలోని 72 రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దార్ అశోక్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసేందుకు ప్రతి నెలా 1వ తేదీ నుండి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయని తెలిపారు. రూరల్ ఏరియాలో ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ, అర్బన్ ఏరియాలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుండి 8 గంటల వరకూ పనిచేస్తాయని తెలిపారు. కార్డుదారులు అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులు పొందొచ్చని తెలిపారు. రేషన్ దుకాణం పరిధిలోని వికలాగులు, అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దకు డీలర్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కార్డుదారులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే వస్తువు డెలివరీ

బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్‌ను ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే వస్తువు డెలివరీ చేయడం బ్లింక్ ఇట్ ప్రత్యేకత అని, ఇటువంటి సూపర్ మార్కెట్ భీమవరం పట్టణంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక పద్మాలయ థియేటర్ రోడ్డులోని కోదండ రామాలయం వద్ద బ్లింక్ ఇట్ సూపర్ మార్కెట్‌ను గురువారం ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. భీమవరం నియోజకవర్గానికి కార్పొరేట్ సంస్థలు తరలివస్తున్నాయన్నారు. అభివృద్ధిలో భీమవరం శరవేగంగా ముందుకు సాగుతోందన్నారు. స్టోర్ నిర్వాహకులు గొట్టుముక్కల బలరామ కృష్ణంరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ 26 స్టోర్స్ ఉన్నాయని, భీమవరంలో మొదటి స్టోర్ అని అన్నారు. అన్ని రకాల వస్తువులూ ఒకే చోట లభిస్తాయని, ఆర్డర్ ఇచ్చిన 15 నిమిషాల్లోనే డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు. తారకరామ కన్‌స్ట్రక్షన్ అధినేత పళ్ల ఏసుబాబు మాట్లాడుతూ కుటుంబానికి అవసరమైన వస్తువులు ఆర్డర్ ఇచ్చిన 10 నిమిషాలకే ఇంటికి అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి జయసూర్య, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, పళ్ల ఏసుబాబు, పొత్తూరి బాపిరాజు, సిఐ కాళీ చరణ్, కూనపరాజు బలరామరాజు పాల్గొన్నారు.

జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు మండల సమాక్య భవనంలో జిల్లా మహిళా సమాక్య సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. సహకార శాఖ సహకార అధికారి వెంకటేశ్వరారావు పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో జిల్లా నూతన మహిళా సమాక్య పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మహిళా సమాక్య అధ్యక్షురాలుగా మణి (యలమంచిలి), ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి (వీరవాసరం), కార్యదర్శిగా నాగమణి (పోడూరు), జాయింట్ సెక్రటరీగా జయలక్ష్మి (ఉండి), కోశాధికారిగా ప్రసన్న (పాలకొల్లు) ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, డిపిఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా వాతావరణం

ప్రజాశక్తి - పాలకొల్లు

గత రెండు రోజులుగా పాలకొల్లు పట్టణంలో వాతావరణం మబ్బులతో ఆహ్లాదంగా ఉంది. రోహిణీ కార్తెలో ఇటువంటి చల్లని వాతావరణం ఉండటంతో వివాహ వేడుకలు జరుపుకునే వారు మాత్రం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఐస్‌తో ముడిపడిన అమ్మకందార్లు మాత్రం గగ్గోలు పెడుతున్నారు.

31న గణపవరంలో సమైక్యతా యాత్ర

ప్రజాశక్తి - గణపవరం

సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 31న సమైక్యతా యాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి గురువారం తెలిపారు. ఈ యాత్రలో మండలంలోని పార్టీ నాయకులు సమైక్యా వాదులు పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని కోరారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - ఆకివీడు

సినిమా థియేటర్లలో తినుబండారాల విక్రయంపై ప్రభుత్వం దృష్టి సారించటం, అక్కడ తప్పులను గుర్తించే ప్రయత్నం ప్రారంభించడం శుభ పరిణామమని వినియోగదారుల సంఘాల సమాచార రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ థియేటర్లలో తినుబండాలపై దోపిడీ భారీ స్థాయిలో పెరిగిందన్నారు. ఎంఆర్‌పిఎస్ రేట్ల కన్నా నాలుగు ఐదు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. అధికారులు వినియోగదారుల సంఘాలతో సమన్వయంగా పర్యవేక్షణ చేసేందుకు కమిటీలు నిఘా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే వెంటనే తనిఖీలు ముమ్మరం చేసి వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని బంగారయ్య అధికారులను కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తాడేపల్లిగూడెం

విద్యుత్ లైన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఎపి ఇపిడిసిఎల్ కె.నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఉన్న గణేష్‌నగర్ ఫీడర్‌కు సంబంధించి గాంధీ బొమ్మ సెంటర్, ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, గణేష్‌నగర్, కొండలమ్మా గుడి ఏరియా, మిలిటరీ కాలనీ, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువత దేశ భద్రతకు పాటుపడాలి

భీమవరం టౌన్:యువత చైతన్యవంతులై దేశ భద్రతకు పాటుపడాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. గురువారం జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరంలోని కాటన్ పార్క్ వద్ద వృద్ధులతో జయహో భారత్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చింతలపాటి సూర్యనారాయణ రాజు, విజయ రామరాజు, వేగేశ్న కృష్ణంరాజు, పెన్మెత్స బాపిరాజు, సీతారామరాజు, కె.రామరాజు, ఉద్దరాజు కృష్ణంరాజు, ఉద్దరాజు నరసింహరాజు మాట్లాడారు. కార్యక్రమంలో చల్లా రాము, కొప్పినీడి బాబీ, నడింపల్లి కృష్ణంరాజు పాల్గొన్నారు.

పోష్ యాక్టుపై అవగాహన

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు

నరసాపురం:నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు హాల్ వద్ద ప్యానెల్ లాయర్స్, లీగల్ సర్వీసెస్ సభ్యులు, పారా లీగల్ వాలంటీరకు 'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013'పై ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు మాట్లాడుతూ అందరూ 'పోష్' (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్ యాక్ట్" తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. స్త్రీ, పురుషులు పనిచేసే ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురై, ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా కుంగిపోకుండా, ఆత్మహత్యలకు పాల్పడకుండా ఈ అంతర్గత ఫిర్యాదుల కమిటీలో బాధితులు ఫిర్యాదు చేసుకోవాలన్నారు. పోష్ యాక్ట్‌పై అవగాహన పెంచేందుకు ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, కమిటీ సభ్యులు సహకరించాలని, లేదా వారి దృష్టిలోకి వచ్చిన ఈ అంతర్గత ఫిర్యాదులు కమిటీ గురించి వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సభ్యులు, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ఉండి:ఉండి కొత్తపేటలోని ప్రజలకు తాగునీరు పబ్లిక్ కుళాయిల ద్వారా అందకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం రాత్రి వాటర్ ట్యాంకర్ల ద్వారా ఇన్‌ఛార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సివిఎస్ రెడ్డి మాట్లాడుతూ రక్షిత తాగునీరు ప్రతి ఒక్కరికి అందజేయాలనే ఉద్దేశంతో కొత్తపేట ప్రాంత ప్రజల ఫిర్యాదు మేరకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేయడం జరిగిందని తెలిపారు. ఇక మీదట ఇటువంటి ఫిర్యాదులు రాకుండా ప్రతి ఒక్కరికి నీరు అందిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హరినాథ్ రాజు, పంచాయతీ కార్యదర్శి అనిల్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

3 గ్రామాల రైతులకు రూ.24 కోట్లు పరిహారం

దుంపగడప, ఆకివీడు, అజ్జమూరు రైతుల హర్షం

భీమవరం :దుంపగడప, ఆకివీడు, అజ్జమూరు గ్రామాల మీదుగా సుమారు 6 కిలోమీటర్ల పరిధిలో ఎన్‌హెచ్-165 బైపాస్ నిర్మాణానికి 2017లో రైతుల నుండి ప్యాకేజ్ వన్‌లో భూములు ఇచ్చిన రైతులకు ఎట్టకేలకు పరిహారం అందింది. గతంలో రైతుల భూములకు పరిహారం అందకపోవడంతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కలిసి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకున్న కలెక్టర్ జాతీయ రహదారుల అధికారులతో సమావేశమై రైతుల సమస్యను చాకచక్యంగా పరిష్కరించారు. ఈ నేపథ్యంలో 200 మంది రైతులకు రూ.24 కోట్లు వడ్డీతో సహా అసలు రైతుల ఖాతాలలో జమ చేయించడం జరిగింది. ఈ నేపథ్యంలో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం కలెక్టరేట్లో మూడు గ్రామాల రైతుల ప్రతినిధులుగా కొంతమంది రైతులు కలెక్టర్‌ను కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

రసాబాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

మున్సిపల్ అధికారులకు, కౌన్సిల్‌కు మధ్య ప్రోటోకాల్ వివాదం తరచూ తలెత్తుతోంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం లోని సమావేశం మందిరంలో గురువారం ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం ప్రోటోకాల్‌పై దద్దరిల్లింది. ఈ నెల 27న పట్టణంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమం మున్సిపల్ కౌన్సిలర్లకు ఎందుకు తెలియపర్చలేదని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను నిలదీశారు. సమావేశం ప్రారంభం నుంచి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డు కౌన్సిలర్ ఎస్.సురేష్ మాట్లాడుతూ కనీసం ఛైర్‌పర్సన్ కు, ఆ వార్డు సభ్యులు వన్నెంరెడ్డి శ్రీనుకు కూడా యోగాంధ్ర కార్యక్రమం గురించి తెలియజేయక పోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ విషయంపై వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని, కో ఆప్షన్ సభ్యులు వైకెఎస్, 5వ వార్డు సభ్యులు వన్నెం రెడ్డి శ్రీను, వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని మున్సిపల్ కమిషనర్ అంజయ్యను ప్రశ్నించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 40 మందికి పైగా సచివాలయం సిబ్బందికి నోటీసులు ఇవ్వడంపై కూడా కౌన్సిల్‌లో చర్చ జరిగింది. వైకెఎస్ మాట్లాడుతూ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి అధికారి పరిపాలన ఎన్నడూ చూడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమిషనర్ అంజయ్య పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించక పోవడం కౌన్సిలర్లను చిన్న చూపు చూడటమే అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొత్తపల్లి నాని కూడా తనదైన శైలిలో అధికారులు పనితీరును ఎండగట్టారు. ఈ నేపథ్యంలో జనసేన కౌన్సిలర్‌లు అయిపోయిన కార్యక్రమంపై ఎందుకు ఈ రగడ అనడంతో వివాదం కాస్తా ముదిరింది. దీనిపై ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ పోడియం నుంచి కిందికి వచ్చి జనసేన కౌన్సిలర్‌లకు కౌంటర్ ఇచ్చారు. ఆమెతో పాటు వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, జిల్లెళ్ల దిలీప్, కావలి రామ సీతా, యర్ర ఉమా జనసేన కౌన్సిలర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయాలి

ప్రజాశక్తి - ఉండి

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ యోగాంధ్రాపై అవగాహన సదస్సులు నిర్వహించి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం నుంచి యోగాంధ్రాపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్ కావడి నాగార్జున, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సివిఎస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను తమ దిన చర్యలో భాగంగా చూసుకోవాలన్నారు. యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ పంపిణీలో డీలర్లు ఎలాంటి అలసత్వం వహించినా సహించేది లేదని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ సూచించారు. గురువారం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లు ఉదయం సాయంత్రం రెండు పూటలా రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలని, పట్టణంలో రేషన్ కార్డుదారులు దూరంగా ఉండే డిపోలను వారికి సమీపంలో ఉండేలా చూసుకోవాలన్నారు.

CHANGE OF NAME

I, **BUSI JAGAN MOHAN RAO,** S/o. Nakshatra Rao, D.No: 11-6-43, Gandhinagar-2, Narasapuram, West Godavari Dist., Pin-534275 changing my name **BUSI JAGAN MOHANA RAO,** (old name) to **BUSI JAGAN MOHAN RAO** (new name) Hence forth Iam being called as **BUSI JAGAN MOHAN RAO** (new name) for all purposes.

CHANGE OF NAME

I, **BODDU VIJAYA SWAMY** S/o Boddu Samba Murthy, D.No. 8-4-138, Patapadu,, Kalipatnam Post, Mogaltur Mandal, W.G.Dt. A.P. I have changed my name from **BUDDU VIJAYA SWAMY** (Old name) to **BODDU VIJAYA SWAMY** (New name) hence forth I am being called **BODDU VIJAYA SWAMY** S/o Boddu Samba Murthy for all purposes.

పేరు మార్పు ప్రకటన

మద్దా చిన్నిరావు (కొత్తపేరు) తండ్రి: మద్దా దావీదు, డోర్ నెం. 4-12/1, చిన్నగరువు, తుందుర్రు, భీమవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ (ఇండియా) నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును మద్దా చిన్నారావు (పాతపేరు) తండ్రి: మద్దా దావీదు నుండి మద్దా చిన్నిరావు (కొత్తపేరు) తండ్రి: మద్దా దావీదుగా మార్చుకున్నాను. ఈరోజు నుండి అదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్తపేరును ఉపయోగించవలెను.

మద్దా చిన్నిరావు, S.o. దావీదు
డోర్ నెం. 4-12/1, తుందుర్రు,
భీమవరం మండలం, ప॥గో॥జిల్లా.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, కల్పన థియేటర్ దగ్గర, డోర్ నెం. 4-19-5/1, రు కాపురస్తులు బెల్లంకొండ ఉదయ్ కుమార్, తండ్రి: సత్యనారాయణ అను నా యొక్క ఒరిజినల్ లింక్ దస్తావేజులు పడిపోయినవి. ఏలూరు ఆర్.సి.లో 1వ పుస్తకం దస్తావేజు నెం: 238/1993 ది. 11-01-1993వ తేదీన రిజిష్టర్ కాబడి ఉన్నాయి. సదరు ఒరిజినల్ దస్తావేజులు ది. 20-05-2025వ తేదినాడు మా ఇంటి వద్దనుండి పెద్ద పోస్ట్ ఆఫీస్ సమీపములో జిరాక్స్ తీయుంచుకునేందుకు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బెల్లంకొండ ఉదయ్ కుమార్
S/o. సత్యనారాయణ,
కల్పన థియేటర్ దగ్గర, డోర్ నెం: 4-19-5/1,
పాతమార్కెట్, ఏలూరు, ఏలూరు జిల్లా,
సెల్: 98484 68685

ప్రకటన
మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) భీమడోలు, పశ్చిమ గోదావరి జిల్లా వారి కోర్టులో
O.S.No. 10/2022

Between:
మోరు సాయి ప్రసన్న @ బలే సాయి ప్రసన్న మరియు యింకొకరు ...వాదులు
మరియు
బలే గౌరీశంకరరావు మరియు వగైరాలు ...ప్రతివాదులు
To,
D-3 : సైదు త్రిమూర్తులు, **S/o.** నరశింహారావు, ఆగదాలలంక, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా- 534427.
D-4 : బలే శశికళాదేవి, **D/o.** లక్ష్మీనారాయణ (లేటు), డోర్ నెం. 5-142, ఆగదాలలంక, భీమడోలు మండలం, ఏలూరు జిల్లా- 534427.

పై నంబరు దావా గ్రంథములో వాదులు అయిన మోరు సాయి ప్రసన్న @ బలే సాయి ప్రసన్న మరియు బలే లక్ష్మీ ప్రసన్న అను వారు మీ మీద పైన తెల్పిన కోర్టు వారి ఎదుట దావా షెడ్యూలు ఆస్తిని వాటాల విభజన కొరకు దావా దాఖలు చేసినందున మీకు పై కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపించినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రికా ముఖంగా సమన్లు అమలుకు ఆర్డరు అయి వున్నది. కావున వాయిదా **ది.20-06-2025వ తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాగలరు. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడును.

G.V. Nageswara Rao,
M. Kedari,
K.V. Satyanarayana
ఏలూరు
29-05-2025
వాది తరపు న్యాయవాదులు
ఏలూరు
Cell: 94409 88449